ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
గురువారం 13 నవంబరు 2025





సమ్మక్క, సారలమ్మ గద్దెలకు ఉపయోగించే గ్రానైట్ రాతిని పరిశీలిస్తున్న మంత్రులు

జాతీయ పండుగగా గుర్తించాలి : మంత్రి సురేఖ

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏయే విభాగంలో ఎవరెవరు ఏయే పనులను చేయాలో ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఇది ఎవరి ఇంటికి సంబంధించిన పని కాదని, రాష్ట్ర ప్రగతికి, గిరిజనుల ఆరాధ్య దైవానికి ఇచ్చే ప్రాధాన్య అంశమని స్పష్టం చేశారు. మేడారం మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించేలా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి చొరవ చూపాలని అన్నారు. వారే స్వయంగా ప్రధాని మోదీ వద్దకు వెళ్లి జాతీయ హోదాను తీసుకురావాలని కోరారు.

- భవిష్యత్తులో పది కోట్ల మంది వచ్చినా సరిపడా సౌకర్యాలు
- అవసరమైతే మాస్టర్‌ప్లాన్‌లో మరిన్ని అంశాలు చేర్చుతాం
- గిరిజనుల సంప్రదాయాలను గౌరవిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి మేడారంలో పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన.. అధికారులతో సమీక్ష

పక్కా ప్రణాళికతో మేడారం అభివృద్ధి పనులు

200 ఏళ్ల వరకు చెక్కుచెదరకుండా నిర్మాణాలు

ములుగు/తాడ్వాయి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేడారం వనదేవతల దేవస్థాన అభివృద్ధి పనులను పక్కా ప్రణాళికతో చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి బుధవారం పర్యటించారు. మేడారంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. కనీసం 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా దేవస్థానం పునరుద్ధరణ, అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పటిష్ఠ ప్రణాళికతో చేపడుతు న్నారని అన్నారు. గిరిజన సంప్రదాయలను గౌరవించి వారి ఆరాధ్య దైవానికి ఆలయాన్ని నిర్మించే పనిని సీఎం పెట్టుకు న్నారని తెలిపారు. రానున్న మహాజాతరకు 2.50కోట్ల నుంచి 3కోట్ల మంది వరకు భక్తులు రానున్నారనే అంచానాలు ఉన్నాయని మంత్రి అన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం మేడారంలో సౌకర్యాలు మరింత మెరు గుపడితే భవిష్యత్తులో జరిగే మహాజాతరలకు 10కోట్ల మంది వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు భక్తులకు సరిపడా వసతు లు కల్పించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఫేస్-2 లో మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన అంశాన్ని కూడా చేరుస్తామని తెలిపారు. ఈ నెల 22 తర్వాత సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి ఆయన సూచనల మేరకు ఇంకా ఏమైనా మాస్టర్‌ప్లాన్‌లో చేర్చాల్సిన అంశాలు ఉంటే వాటిని కూడా చేర్చి పనులను ముందుకు తీసుకెళ్తామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

సీఎం సంకల్పసిద్ధికి నిదర్శనం: మంత్రి లక్ష్మణ్

మేడారం అభివృద్ధి పనులను సమన్వయంతో ముందుకు

(మిగతా 7వ పేజీలో)



సమావేశంలో పాల్గొన్న ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు

- రైల్వే స్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయాలి
- మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుని, తగిన ఏర్పాట్లు చేయాలని మానుకోట పార్లమెంట్ సభ్యుడు, దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాంనాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో కొత్తబజారు వైపు నాల్గవనెంబర్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేయాలని కోరారు. కేసముద్రం వర్క్‌షాప్‌కు సంబంధించి విషయాలను రైల్వేఅధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. డోర్నకల్ రైల్వేట్రాక్ పైకి నీరురావడానికి గల కారణాలను తెలుసుకుని, అందుకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు.

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల వివిధ దశల్లో పూర్తయ్యాయని, వాటికి బిల్లులను సకాలంలో చెల్లించాలని సూచించారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగకుండా చూసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు పట్టణ ప్రజల కల అని, దానికి ప్రతిపాదనలు చేసి, పనులు త్వరగా ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలన్నారు. జిల్లాలోని తండాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అవసరమైన చోట మరమ్మతులు చేయాలన్నారు. ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిలో జిల్లా అవార్డు సాధించడంలో కలెక్టర్, సంబంధిత అధికారుల కృషిని అభినందించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షిస్తూ సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం జరుగకుండా త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. పొలం బాట కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల పనులకు సంబంధించి పనుల టెండర్లను పూర్తి చేసి, మొదలయ్యేలా చూడాలని రాంచందర్‌నాయక్ అన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్‌లు లెనిన్‌వత్సల్ టొప్పో, అనిల్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు, దిశా కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



యువజన ఉత్సవాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పో

యువత సామాజిక అంశాల్లో భాగస్వాములు కావాలి

అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యువత విద్యతో పాటు క్రీడా, సామాజిక అంశాల్లో భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో సూచించారు. మహబూబాబాద్‌లోని జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించి, జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు-2025ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ యువజన ఉత్సవాలు పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో యువజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువతీ, యువకులు వివిధ సామాజిక అంశాలు, విద్య, క్రీడా, సాంస్కృతిక, వ్యాసరచన, కవిత్వం, ఎగ్జిబిషన్స్, పెయింటింగ్స్, కథా రచనలు, జానపద నృత్యం మొదలగు అంశాలపై నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొని, ప్రతిభ కనబరిచేందుకు మంచి వేదికగా ఉంటుందన్నారు. జిల్లాస్థాయి కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు 12 జనవరి, 2026 నుంచి న్యూఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి ఉత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో కూడా రాణించి మానుకోట జిల్లాకు గుర్తింపు తేలవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి, జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి, డీఎస్వో అప్పారావు, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం సిరినాయక్, శ్యామలాదేవి, కీర్తనారెడ్డి, సురేష్, శ్రీరాములు, శ్రీలత, సునిత, నయీమ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్డు ద్వారానే యూరియా పంపిణీ

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇక నుంచి.. వ్యవసాయ శాఖ అందించే కార్డు ద్వారానే రైతులకు యూరియాతో పాటు ఎరువులు కూడా సరఫరా జరుగుతందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. రైతులందరికి సమగ్రంగా యూరియా అందించాలనే లక్ష్యంతో జిల్లాలో కొత్తగా ప్రవేశపెట్టిన యూరియా కార్డు (పంటల నమోదు, సమగ్ర ఎరువుల యాజమాన్య పత్రం)ను బుధవారం ప్రపథమంగా బయ్యారం మండలంలో ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తపేట రైతు వేదికగా జరిగిన కార్యక్రమంలో కొంత మంది రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదిగా యూరియా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాసంగిలో పంట సాగుచేసే ప్రతీ రైతుకు యూరియాతో పాటు సంబంధిత ఎరువులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, వ్యవసాయశాఖ సూచనల మేరకు పంట సాగుచేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. అనంతరం ఏవో రాజు మాట్లాడుతూ కార్డు యొక్క ప్రాధాన్యతను వివరించారు. గురువారం నుంచి మండల వ్యాప్తంగా ఏఈవోల ద్వారా క్లస్టర్ల వారిగా రైతులకు యూరియా కార్డు పంపిణీ చేస్తారన్నారు. కార్డు కలిగిన రైతు మండలంలో ఏ డీలర్ వద్దనైనా యూరియా కొనుగోలు చేసే సౌలభ్యం కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో నాలుగు ప్రైవేట్ డీలర్ల షాపులతో పాటు రెండు సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉన్నట్లు వెల్లడించిన ఏవో త్వరలోనే అన్ని డీలర్ల వద్ద యూరియా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టాదారు, పోడు, కౌలు రైతుతో పాటు పంట సాగు చేసే ప్రతీ రైతుకు సమగ్రంగా యూరియా పంపణీ చేయటం జరుగుతుందన్నారు. ఇల్లెందు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఏడీఏ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో దీపిక, ఎస్సై తిరుపతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఏఈవోలు ఫయాజ్, నాగరాజు, అఖిల్, తేజస్వినితో పాటు రైతులు పాల్గొన్నారు.



బయ్యారంలో మహిళా రైతుకు యూరియా కార్డును అందిస్తున్న కనకయ్య



వంటావార్పు చేసి నిరసన తెలుపుతున్న ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు సుశీల

ఇందిరమ్మ ఇంటిబిల్లు ఇవ్వడంలేదని..

జీపీ కార్యాలయంలో వంటావార్పు 8

18న ముసలమ్మ జాతరలో వేలం

కొత్తగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంజేడు ముసలమ్మ జాతరలో ఈనెల 18న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో శేషగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజ సామాను, ఫొటోలు అమ్ముకునే హక్కు, శీతల పానీయాలు, కిరాణం సామాను అమ్ముకునే హక్కు కోసం వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

వేలంలో పాల్గొనే వారు ఈనెల 17 సాయంత్రం 4 గంటల వరకు శ్రీముసలమ్మ జాతరలో టెండర్ ఫారాలు పొందాలని సూచించారు. 18న జాతరలో బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కొబ్బరికాయల విక్రయాలకు రూ.2 లక్షలు, కిరాణ సామాను విక్రయాలకు రూ.50 వేలు శ్రీముసలమ్మ జాతర పేరుమీద డీడీ రూపంలో తీసుకుని వేలంలో పాల్గొనాలని ఈవో సూచించారు.

స్కూళ్ల సమస్యల పరిష్కారానికి పోరాటం

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం దశలవారీగా పోరాటాలు నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గూడూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల కాలంలో పాలకవర్గ ప్రభుత్వాలు గిరిజన సంక్షేమ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. అందులో పనిచేసే ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. గత 14 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ పోస్టులు, 30 సంవత్సరాల నుంచి 4వ తరగతి ఉద్యోగులు, క్లర్క్ పోస్టులు మంజూరు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యక్ష నియామకాలు జరగడం లేదని, రాష్ట్రంలోని అన్ని గిరిజన వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేయాల్సి ఉండగా చేయలేదని చెప్పారు. 2013-14 సంవత్సరంలో ప్రారంభించిన కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలను 2014-15లో ప్రారంభించిన నూతన ఆశ్రమ పాఠశాలలకు ఉపాధ్యాయ పోస్టులు నేటికి మంజూరు చేయలేదన్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న ద్వితీయ శ్రేణి భాషపండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను ఉన్నతీకరించి రెండు సంవత్సరాలు గడిచినప్పటికి గిరిజన సంక్షేమశాఖలో పని చేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను ఇంత వరకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉన్నతీకరించకుండా విషపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఈనెల 24న జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్, ఐటీడీఏ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన, డిసెంబర్ 12న కమిషనర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ మండల బాధ్యులు ఆదినారాయణ, శ్రీనివాస్, నర్సింగరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేసుకోవాలి

దంతాలపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కపాస్ యాప్ ద్వారా పత్తి కొనుగోలుకు శ్రీకారం చుట్టిందని అందుకు తప్పక మోబైల్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో వాహిని అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని పలు గ్రామాల రైతుల వివరాలను సేకరిస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. రైతులు నేరుగా సీసీఐలో మాత్రమే పత్తి విక్రయం జరపాలన్నారు. పత్తి రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఏఈవోలతో అవగాహన కల్పిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవో శిరీష, దీక్షిత్‌కుమార్, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను రైతులు కాల్చొద్దు

దంతాలపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) వరి కొయ్యలను రైతులు కాల్చొద్దని వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని రేపోణి, కుమ్మరికుంట్ల, తదితర గ్రామాల్లో వరి కొయ్యల కాల బెట్టడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో రైతులు ఉదయ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో-బేటీ పడావో పోస్టర్ల ఆవిష్కరణ

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బేటీ బచావో-బేటీ పడావో పోస్టర్లను మరిపెడ మండల్ పరిషత్ ఆఫీస్‌లో స్థానిక వివిధ శాఖలకు చెందిన అధికారులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మరిపెడ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సోమ్లానాయక్, మహిళా సాధికారత సిబ్బంది సంధ్యరాణి, కైలాష్ సత్యార్థి, వసుందర, సఖి కేంద్రం సభ్యురాలు స్వరూప, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాలిపోయిన పత్తి

సుమారు రూ.4లక్షల నష్టం

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చిన్నగూడూరు మండల కేంద్రం శివారు రాంచంద్రుతండా బాధిత రైతు బాదావత్ శంకర్‌కు చెందిన రూ.4లక్షల విలువైన సుమారు 50 క్వింటాళ్ల ఆరపోసిన పత్తి బుధవారం దగ్ధమైంది. ఇంటి ఆరబయట పత్తిని ఎండకు ఆరపోయగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని కాలింది. చేను వద్ద ఉన్న ఆ రైతు కుటుంబం విషయం తెలిసి ఇంటికి చేరుకునే సరికి పత్తి మంటల్లో కాలిపోతోంది. అప్పటికప్పుడు బిందెలు, బకెట్లతో నీళ్ల కుమ్మరించి కొంత ఆర్పివేశారు. ఆరు కాలం కష్టించి పండించిన పత్తి అగ్నికి ఆహుతి కావడంతో బాధిత రైతు కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

దొంగతనం కేసులో నిందితుల రిమాండ్

తొర్రూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గత నెల 16వ తేదీన దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేందర్ బుధవారం తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఎల్లమ్మ ఇంట్లోలేని సమయంలో ముగ్గురు వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.1లక్ష 90వేల విలువ గల బంగారు, వెండి, నగదు దొంగిలించారు. ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన పొన్నాల శివశంకర్, పొన్నాల రేణుక, హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన తన్నీరు శివ లను అరెస్టు చేసి విచారించగా దొంగతనాన్ని అంగీకరించారని, గతంలో కూడా వీరు జడ్చర్ల, పర్వతగిరి ప్రాంతాల్లో చోరీ చేసిన వస్తువులు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ మేరకు ఖమ్మంలోని జిల్లా జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత

ఎస్సై చిలువేరు ప్రమోద్‌కుమార్

పెద్దవంగర, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని, ప్రమాదాలు జరిగినపుడు విధిగా సహకారం అదించాలని ఎస్సై చిలువేరు ప్రమోద్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై హీదయాత్ ఆలీ, లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర మండల అధ్యక్షులు తంగెళ్లపల్లి మల్లికార్జునచారి, ముత్తినేని శ్రీనివాస్, అనపురం రవి, మందపురి సతీష్, బానోతు చంద్రశేఖర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వీడి హైవేపై ఏర్పడ్డ గుంతలను పూడ్చాలి

● ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

దంతాలపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అధికారులు అలసత్వం వీడి వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గల గుంతలను వెంటనే పూడ్చాలంటూ బుధవారం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఉన్నతాధికారులను ఫోన్లో ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు స్పందిస్తూ వారంలోగా వరంగల్ నుంచి ఖమ్మం వరకు జాతీయ రహదారిపై ఉన్న భారీ గుంతలను సత్వరమే పేడ్చి పనులు ముగిస్తామన్నారు. అనంతరం ఆయన సూర్యాపేట-దంతాలపల్లి ఆర్ఎండ్‌బీ రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతల నేపథ్యంలో సంబంధిత ఎస్సీ, ఈఈలకు ఫోన్లో ఫిర్యాదు చేశారు. దీంతో రెండు రోజుల్లో పనులు ప్రారంభించి పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీటవేస్తుందన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ గుంతలను వెంటనే పుడ్చాలంటూ ఆదేశాలు జారీ చేశారు. డోర్నకల్ నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో రోడ్డు ధ్వంసం కావడంతో త్వరలో పనులు చేపిస్తామన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పిల్లల రాజు, నాయకులు పట్టాబి, తాజామాజీ ఎంపీటీసీ యాకన్న, ముత్తు తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలోని హైవేపై గుంతను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

ఒకేసారి ఓ యువకుడికి రెండు కేంద్ర కొలువులు

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఒకే సారి ఓ యువకుడికి రెండు కేంద్ర ప్రభుత్వ కొలువులు దక్కాయి. మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధి ఆముదాలగడ్డ తండాకు చెందిన ధరావత్ లక్ష్మ-భారతిల రెండో కుమారుడు బావుసింగ్ ఇటీవల జరిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలు రాసి అత్యున్నతమైన ర్యాంక్ సాధించి రైల్వే శాఖలో జూనియర్ ఇంజినీర్, నేషనల్ థర్మల్ పవర్‌లో ఈఈగా ఎంపికయ్యారు. చత్తీస్‌గడ్‌లోని కోర్బా ప్రాంతంలోని నేషనల్ థర్మల్ పవర్ ఈఈగా చేరిక అయ్యారు. చిన్నగూడూరు మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో ఉండి పదోవ తరగతి వరకు చదివారు. బాసర త్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఉద్యోగ అన్వేషణలో రెండేళ్ల పాటు హైదరాబాద్‌లో ప్రిపేరయ్యి ఈ ఉద్యోగాలు సాధించారు. బావుసింగ్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంగోత్ చందూలాల్, స్థానిక తండా వాసులు, చిన్నగూడూరులోని సహచర విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు. పేదింట్లో మెరిసిన విద్యా కుసుమం ధరావత్ బావుసింగ్‌ను గిరిజన నిరుద్యోగ యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని చందూలాల్ చిన్నగూడూరు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన యువతను కోరారు.



బావుసింగ్

ఆర్థిక సాయం

తొర్రూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన వరద బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. వరంగల్ నగరంలోని శాయంపేట, ప్రణయ భాస్కర్ కాలనీ, తదితర బస్తీల్లో భారీ వర్షాలకు నష్టపోయిన 40కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2వేల ఆర్థికసాయం, బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాంనర్సయ్య మాట్లా డుతూ క్లబ్ సభ్యుల సాకారంతో మొత్తం రూ.80వేల విలువ గల నిత్యావసర సరుకులు, బట్టలు ఇతర వస్తువులు అందజేశామ న్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఎంతో మంది పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నా మని, వారికి వైద్యుడు నర్సింహనాయక్ సాకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ చిదిరాల నవీన్, రీజియన్ చైర్మన్ సరేష్, రవీందర్ రెడ్డి, వజినెపల్లి శ్రీను, శంకర్, శ్యామ్, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు సీజే గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు నవంబరు 17న ఢిల్లీలో జరిగే దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనకు పెద్ద ఎత్తున మాదిగ జాతి బిడ్డలు తరలి వచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బేతల్ కిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం మరిపెడ గెస్ట్ హౌస్‌లో జినక స్వామి అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘ నాయకులు దూడపంగు శ్రీనివాస్‌రావు, ఇరుగు రవి, వంగూరి బాబు, జినక శ్రీను, రమేశ్, ఉపేందర్, సన్ని, చింటూ, టోని తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష పార్టీలు ఏకమై పోరాడాలి

తొర్రూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్పొరేట్ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు ఏకమై పోరాటాలు సాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారధి అన్నారు. బుధవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవుల్లో మావోయిస్టులు సాయుధ పోరాట పంథాలను వీడి కొత్త పందాలు వామపక్షాలతో పనిచేయాలన్నారు.

దేశంలో బానిసత్వం ఉన్నప్పుడు పీడిత ప్రజలకు ధీటుగా ఎన్నో వీరోచిత పోరాటాలు జరిపి వాటికి నాయకత్వం వహించి అమరులైన వీరుల త్యాగాలతో శతవసంతాలు పూర్తిచేసుకున్న సీపీఐ వంద సంవత్సరాల పండుగను డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహిస్తారని, ఈ సభకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు, మండల కార్యదర్శి బందు మహేందర్, లక్ష్మణ్, కిరణ్‌కుమార్, వెంకన్న, యాదగిరి, యాకాంతం, ఎల్లయ్య, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న డబ్బు రికవరీ

మరిపెడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైమ్‌లో పోగొట్టున్న డబ్బు కొంత రికవరీ చేసి బాధితుడికి ఇప్పించినట్లు మరిపెడ సీఐ ఎస్.రాజ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మరిపెడ సర్కిల్ ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రాంపురం శివారు కొత్తూరుకు చెందిన నితీశ్ గత జూన్ మాసంలో సైబర్ క్రైమ్ నేరగాళ్లకు చిక్కి రూ.99,995 నగదును పోగొట్టుకున్నారు. ఆయన తన ఫోన్ హ్యాక్ కావడంతో ఆధార్, మీసేవా కేంద్రాలకు చుట్టూ తిరిగి సైబర్‌క్రైమ్ అని తెలుసుకొని మరిపెడ పోలీసులు ఆశ్రయించారు. పోలీసులు సైబర్‌క్రైమ్ నేరగాళ్లను ఛేదించి రూ.27వేలు రికవరీ ఇప్పించామన్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల కాల్స్, మెస్సేజీలకు స్పందించొద్దని సూచించారు. సైబర్ క్రైమ్ నేరం జరిగితే వెంటనే 1930టోల్ నంబరుకు కాల్ చేసి సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్సైలు వీరభద్రరావు, కోటేశ్వర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

వెంకన్న మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

పెద్దవంగర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వేముల వెంకన్న (54) మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పరగూడెంలో వేముల వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట మండల ఇన్‌చార్జి విజయపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, సోమ రాజశేఖర్, రంగు మురళి, దుంపల శ్యామ్, గోపాల్‌నాయక్, రవీందర్‌రెడ్డి, వేణు తదితరులు ఉన్నారు. అలాగే తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి బుధవారం వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట తొర్రూరు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంచు సంతోష్, అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



వెంకన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఝాన్సీరెడ్డి

● తొర్రూరు (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆ పార్టీ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరు పట్టణంలో వివిధ కారణాలతో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పట్టణం లో బొమ్మనబోయిన వెంకన్న, మల్లయ్య కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, ప్రవీణ్‌రావు, సురేందర్ రెడ్డి, శ్రావణ్, విజయ్‌పాల్ రెడ్డి, సురేష్, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నగూడూరు మండలం విస్సంపల్లి గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి సుమతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు బుధవారం విస్సంపల్లిలోని మృతురాలి ఇంటికి చేరుకొని సుమతమ్మ చిత్ర పటానికి పూల మాలలేసి నివాళులర్పించారు. రోదిస్తున్న కుటుం సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్సీ వెంట ఐఆర్ఎస్ ఆఫీసర్ యశ్వంత్‌రావు, దుష్యంత్‌రావు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



సుమతమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

సర్కారు పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు

● భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో ఆయన బుధవారం పర్యటించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్యుయెల్ డెస్క్‌లు, ఆదివాసీ గిరిజన భవనంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వయాట్రీస్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో విద్యార్థులకు డ్యుయెల్ డెస్క్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కాటారం డివిజన్ పరిధిలోని 26 పాఠశాలలకు మొదటి విడతలో 226, రెండో విడత 56 ఈ డెస్క్‌లు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఆదివాసీ గిరిజన భవనంలో మహిళా గ్రామీణాబివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, స్థానిక సంస్థల కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, డీఆర్‌డీవో బాలకృష్ణ, ఎంపీడీవో రవీంద్రనాథ్, సీడీపీవో రాధిక, వయాట్రీస్ సంస్థ ప్రతినిధి హనీష, సింగిల్ విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ రాణిబాబు, మాజీ జడ్పీటీసీ అరుణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

సాదాబైనామాల దరఖాస్తులను పరిష్కరించాలి

భూభారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని మహదేవపూర్ తహసీల్దార్ రామారావును కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయాలన్ని ఆయన సందర్శించారు. భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిశీలనను సమీక్షించారు.

కార్పొరేట్ సేవలో తరిస్తున్న బీజేపీ

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు



మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు

గోవిందరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సర్కార్ కార్పొరేట్ సేవలో తరిస్తూ ప్రజా సంపదను ప్రభుత్వరంగ సంస్థలలో బడా పెట్టుబడదారులకు అమ్మేస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు ఆరోపించారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో సీఐటీయూ ములుగు జిల్లా మూడో మహాసభల ముగింపు బుధవారం జరగగా ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారులకు అనుకూలంగా లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిందని, అందులో భాగంగానే పనిగంటలు పెంచుతోందని విమర్శించారు. నూతన లేబర్ పాలసీ 2025 పేరుతో కార్మికులను కట్టుబానిసలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సీఐటీయూ ములుగు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొప్పుల రఘుపతి, కార్యదర్శిగా రత్నం రాజేందర్, కోశాధికారిగా కె.సమ్మక్క, ఉపాధ్యక్షులుగా ఆర్.నీలాదేవి, సోమ మల్లారెడ్డి, కట్ల నర్సింహచారి, సహాయ కార్యదర్శులుగా సద్దాంహుస్సేన్, అలువాల ఐలయ్య, మడే రవిలను ఎన్నుకున్నారు. అదేవిధంగా సభ్యులుగా కావిరి సుధాకర్, కె.సరోజన, జయాకర్, సీహెచ్.శ్రీనివాస్, బి.సరిత, పాప, కొండయ్య, జమున, స్వరూప, శివకుమార్, యనమల ప్రవీణ్, సాయిబాబు, జయలక్ష్మి, అశోక్ ఎన్నికయ్యారు.

మహాసభను జయప్రదం చేయండి

వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్

వరంగల్ మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న సంగారెడ్డిలో జరిగే వైద్య, ఆరోగ్య ఉద్యోగుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఎంజీఎం ఆవరణలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదనాయక్ మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో వైద్య, ఆరోగ్య రంగంలోని రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులు హాజరవుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చేపట్టిన మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కాళేశ్వరంలో ట్రైయినీ ఐఏఎస్‌ల పూజలు



పూజల్లో పాల్గొన్న ట్రైయినీ ఐఏఎస్ అధికారులు

మహదేవపూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో బుధవారం కార్తీక మాస ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి లక్ష వత్తుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాళేశ్వరస్వామికి బిళ్వ పత్రాలతో పూజలు నిర్వహించారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని ట్రైయినీ ఐఏఎస్‌లు దర్శించుకున్నారు. ముందుగా వారికి రాజగోపురం నుంచి అర్చక స్వాములు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆలయంలో దర్శనం చేయించారు. స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజల్లో పాల్గొన్న ట్రైయినీ ఐఏఎస్‌లలో అనురాగ్ రాజన్, రాజ్ కృష్ణ జై, విప్సన్య తన్వాస్, సి.కృష్ణ, విశేష్‌సింగ్, తుష్యర్‌సింగ్, ఆదిత్య సింగ్, మాన్యాక్ కండేవల్, మణిమాల, విశాల్ సింగ్, పవార్ అక్షయ్, రితికారాథ్ ఉన్నారు.

ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి

విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజు

ములుగు టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికీ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ తప్పనిసరి అని విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ హర్షం రాజు అన్నారు. ములుగులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్ వివరాలు సక్రమంగా ఉండటం ఎంతో ముఖ్యమన్నారు. 5-15 సంవత్సరాల లోపు పిల్లలు తప్పని సరిగా బయోమెట్రిక్ ఎంబీయే-1 చేయించుకోవాలన్నారు. అలాగే 15 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు ఎంబీయూ-2 చేయించుకోవడం అవసరమని తెలిపారు. బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయనట్లయితే ఆధార్ నెంబర్లు డియాక్టివేట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను విద్యార్థులు, వారి తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆధార్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సాయిరాం, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



బయోమెట్రిక్ అప్‌డేషన్ క్యాంపును పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ రాజు

కాల భైరవుడిగా రుద్రేశ్వరుడు

హనుమకొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా నిర్వహిస్తున్న కార్తీకమాస వేడుకల్లో ప్రతినిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. బుధవారం అష్ట మి తిథిని పురస్కరించుకొని విశేష కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం అనంతరం రుద్రేశరుడికి అభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 51 కిలోల పెరుగన్నంతో రుద్రేశ్వరుడికి మిర్యాలపొడి, పెరుగును విలీనం చేసి స్వామివారికి వేదోక్తంగా మహా అన్న పూజ నిర్వహించారు. కలియుగంలో మానవుడు కోరిక కోరికలు తీర్చాల్సిన వాడు పరమశివుడే అని, బ్రహ్మాండమంతా వ్యాపించిన దేహంకల పరమశివుడు సమస్త జీవరాశుల కోర్కెలు తీర్చేవాడని గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. ఈ సందర్భంగా రుద్రేశ్వరుడికి కాలాష్టమికి అనుగుణంగా కాలభైరవుడిగా అలంకరింపజేశారు. పరమశివ భక్తుడు శ్రీనివాస్, లలిత దంపతుల సౌజన్యంతో ఆలయ నాట్యమండపంలో వేద పండితుల మంత్రాల మధ్య సహస్ర లింగార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దేవతావృక్షాల వద్ద ప్రత్యేక దీపాలు వెలిగించుకున్నారు. గంగు మణికంఠశర్మ, ప్రణవ్, శ్రవణ్ తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది మధుకుమార్, రామకృష్ణ, రజిత తదితరులు సేవలందించారు. ఈనెల 15న శనివారం రుద్రేశ్వరాలయ ప్రాంగణంలోని మారేడు వృక్షాల కింద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు పాల్గొనే భక్తులు ముందుగానే తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో అనిల్ కుమార్ సూచించారు.



కాల భైరవ అవతారంలో రుద్రేశ్వరుడు

ఆధ్యాత్మికం, ఆరోగ్యం అయ్యప్ప దీక్ష

- నియమాల మాలతో స్వామికి పూజలు
- ధర్మశాస్త్ర సేవలో భక్తులు
- రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ

వర్ధన్నపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేవున్ని పూజించడం, ఆరాధించడం, ఒక రోజు వివిధ వ్యసనాలకు దూరంగా ఉండి, దేవాలయానికి వెళ్లి మొక్కులు తీర్చడం ఆధ్యాత్మికానికి ప్రతిరూపం. మనకు శరీరంలో మార్పులు జరిగినపుడు వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుని వారు తెలిపే సూచనలు పాటిస్తూ వ్యసనాలకు దూరంగా ఉండి, ప్రతి రోజు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడం ఆరోగ్యం. ఈ రెండింటిని కలుపుతూ అటు ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యాన్ని సైతం కాపాడుకుంటూ స్వామి అనే పదంతో ప్రతి ఒక్కరినీ ఉచ్చరిస్తూ సాగిపోయే 41 రోజుల మండల దీక్ష ప్రతిరూపమే అయ్యప్ప దీక్ష. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అయ్యప్ప స్వాముల దీక్షలు ఘనంగా సాగుతున్నాయి.

దీక్షలో ఒక్కో సూత్రం..

అయ్యప్ప భక్తులు దీక్షకాలంలో నల్లటి వస్త్రాలు ధరిస్తారు. దీంతో వారిపై శని దేవుడి చూపు ఉండదని భక్తులు విశ్వసిస్తారు. శాస్త్రీయంగాను చలికాలంలో నల్లని దుస్తులు శరీరానికి వేడినిస్తాయి. మెడలో రుద్రాక్షమాల, తులసీమాల, స్ఫటిక, తామర, పగడాల మాలలతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. నుదుటిపై కుంకుమ, గంధం, చందనాలు పెట్టుకుని అలంకార ప్రాయంగా ఉంటారు. దీంతో నాడీ మండలానికి కేంద్రం నుదుటి భాగం కావడంతో ఒత్తిడిని దూరం చేయడంతో ఆరోగ్యదాయకమని భావిస్తారు. నేలపై నిద్రపోవడంతో వెన్నునొప్పి దూరమై ప్రశాంతత లభిస్తుంది. పాదరక్షలు లేకుండా నడవడంతో తగిన రీతిలో రక్త ప్రసరణ జరుగుతుంది. తెల్లవారు జామున బ్రహ్మ ముహూర్తంలో, రాత్రి సూర్యాస్తమయం తర్వాత ప్రతి రోజూ తలస్నానం చేయడం వలన మనసుకు హాయిని కలిగించి, ఏకాగ్రత కోల్పోకుండా చేసి శరీరంలోని నరాలు సరిగ్గా పనిచేసేలా చేస్తుంది. దీక్ష సమయంలో ఉదయం సాయంత్రం క్రమ పద్ధతిలో నామపఠనాలు, ధ్యానంతో ఏకాగ్రత, క్రమశిక్షణ అలవాటవుతుంది. ఆహార నియమాలతో కోరికలు అదుపులో ఉంటాయి.


వరంగల్‌లో అయ్యప్ప మాలధారణ చేస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర గురుస్వామి

శబరిమలకు చేరుకోవడం ఎలా ?

దీక్ష చేపట్టిన స్వాములు శబరిమలకు వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారు. ఇందులో ముఖ్యంగా కన్నె స్వాములు తప్పకుండా యాత్ర చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా పెద్ద పాదం చేపట్టే వారు కేరళలోని ఎరిమేలి వరకు వాహనాల్లో చేరుకొని అక్కడి నుంచి నడుచుకుంటూ అటవీ మార్గంలో 70 కిలోమీటర్లు ప్రయాణించి ఆలయానికి వెళ్తారు. మార్గం మధ్యలో కాలికట్ట ఆశ్రమానికి చేరుకుంటారు. అళుదా నదిని దాటి కలిడం కొండ, కరిమళ కొండ, పెరియాన వట్టం, సిరియాన వట్టం గుట్టలపై నుంచి పంపానది మీదుగా వెళ్తారు. పంబా నుంచి చిన్న పాదం ప్రారంభమవుతుంది. పెద్ద పాదం చేయని అయ్యప్ప స్వాములు బస్సుల ద్వారా పంబాకు నేరుగా చేరుకుని అక్కడి నుంచి ప్రతి ఒక్కరు నడిచి వెళ్లాల్సిందే. వృద్ధులకు, నడవలేని వారి కోసం అక్కడ డోలి (మోసుకుని వెళ్లేది) సదుపాయం ఉంటుంది. దానికోసం అక్కడి వారు కొంత డబ్బులు తీసుకుంటారు. పంబాలో పవిత్ర స్నానం ఆచరించి ఇరుముడితో కన్నెముల గణపతికి కొబ్బరికాయ కొట్టి చిన్నపాదం ప్రారంభిస్తారు. అప్పాచి మేడే, నీలిమల కొండ, శరణుగుత్తి కొండపై నుంచి సన్నిధానం వరకు చేరుకుంటారు. అనంతరం 18మెట్లు ఎక్కి అయ్యప్ప దర్శనం చేసుకుని ఇరుముడిని సమర్పిస్తారు. ఇరుముడి ఎత్తుకున్న స్వాములను మాత్రమే 18 మెట్లు ఎక్కేందుకు అక్కడి అధికారులు అనుమతిస్తారు.

నియమాల మాల

ప్రతి ఏటా కార్తీక మాసంలో అయ్యప్ప దీక్షను స్వీకరించి 41 రోజుల పాటు నియమాలతో కూడిన దీక్షను పాటిస్తారు. ఏదైనా ఒక పనిని 41 రోజుల పాటు చేస్తే అది జీవితంలో భాగం అయిపోతుందంటారు. అందరికీ ఈ విషయం తెలిసినా చేయడానికి శరీరం, మనసు అంగీకరించవు. అదే దైవం పేరుతో అనుసరించే దీక్ష అయితే కచ్చితంగా ఆచరిస్తారు. కఠిన దీక్షలు చేయడం వల్ల క్రమశిక్షణ, ఆహార, వ్యవహారాల్లో మార్పు వస్తుంది. అందుకే ఏటా అయ్యప్ప దీక్షాపరుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఇందులో ఇమిడి ఉన్న ఆధ్యాత్మిక, ఆరోగ్య, మానసిక అంశాలు అందరినీ మంత్ర ముగ్దుల్ని చేస్తున్నాయి.

స్వాములకు పేర్లు..

అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాములను ఒక్కో ఏడాది ఒక్కో పేరుతో పిలుస్తారు. మొదటిసారి వేసుకున్న వారిని కన్నె స్వామిగా, రెండోసారి కత్తి స్వామి, మూడోసారి గంట స్వామి, నాలుగోసారి గధ స్వామి, ఐదోసారి పేరు స్వామి, ఆరోసారి గురుస్వామిగా పిలుస్తూ 18 స్లార్లు మాలవేసిన గురుస్వామి కొబ్బరి చెట్టుతో (నారికేళము స్వామిగా) శబరిమల యాత్ర చేయాల్సి ఉంటుంది. ఇందులో కొందరు గురుపదేశం తీసుకుని పూర్తిగా మద్యం, మాంసాహారాలకు దూరంగా ఉంటారు. వీరు మాలధారణ చేపట్టే వారికి ఇరుముడులు కట్టడం, మాల వేయడం చేస్తారు.

ఆరోగ్యానికి మేలు..

అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములకు కఠిన నియమాలు ఉంటాయి. క్రమశిక్షణతో పాటు నియమాల రూపంలో ఉన్న పద్ధతులు పాటిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు సూచిస్తున్నారు. తెల్లవారు జామున చన్నీటి స్నానం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతల క్రమబద్ధీకరణ జరుగుతుంది. శరీరంపై ఒత్తిడి తగ్గుతుంది. ఒక పూట భోజనం వల్ల ప్రోటీన్లు, విటమిన్లు, పీచు పదార్థాలను శరీరం చక్కగా వినియోగించుకుంటుంది. గ్యాస్, ఊబకాయం వంటి ఇబ్బందులు నియంత్రణలో ఉంటాయి. నేలపై పడుకోవడం వల్ల నాడీ, రక్త ప్రసరణ వ్యవస్థలు సక్రమంగా పని చేస్తాయి. శారీరక నొప్పులు తగ్గుతాయి. చెప్పులు వేసుకోకపోవడం వల్ల పాదాలు నేలను తాకుతూ ఉంటాయి. పాదాలపై ఒత్తిడి కలిగి రక్త ప్రసరణ సక్రమంగా సాగుతుంది.

మండల పూజ..

కార్తీక మాసం ప్రారంభం నుంచే అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాములు రెండు పూజల్లో పాల్గొంటారు. డిసెంబరు 26న శబరిమలలో జరిగే మండల పూజకు కొంత మంది స్వాములు హాజరయ్యేలా మాలధారణ చేస్తారు. మరికొంత మంది స్వాములు జ్యోతి దర్శనానికి వెళ్లేలా ప్రణాళిక సిద్ధంచేసుకుంటారు. సంక్రాంతి పండుగ రోజున అయ్యప్ప జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చే రోజున స్వాములు ఎంతో భక్తిశ్రద్ధలతో శబరిమల సన్నిధానంలో వేచి చూస్తారు.

దీని కోసం వివిధ గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు వారికి అనుకూలంగా బస్సుల్లో, రైళ్లలో, ప్రైవేటు వాహనాల్లో, విమానాల్లో వెళ్తుంటారు. కొంత మంది గురుస్వాములు బస్సులను ఏర్పాటు చేసి శ్రీశైలం నుంచి శబరిమల వరకు దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న చాలా దేవాలయాలను చూపిస్తు వెళ్తారు. తిరుగు ప్రయాణంలో సైతం మరిన్ని దేవాలయాలు దర్శనం చేసుకుంటారు.

స్వామి సేవలో తరిస్తున్నా..

పంజా కృష్ణ, వర్ధన్నపేట గురుస్వామి



అయ్యప్ప స్వామి దీక్షను ఆరోసారి తీసుకున్నాను. గత ఐదు సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి వారి సేవలో తరించాను. ప్రతి ఏటా అయ్యప్పను కొలవాలని నిర్ణయించుకున్నాను. గురుస్వామి ఆశీస్సులతో విజయవంతంగా దీక్ష పూర్తి చేస్తున్నాను. ఈ ఏడాది కార్తీక మాసం ముందుగానే రావడంతో మాలధారణ చేసి స్వామివారి సేవలో పాల్గొంటున్నా.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రైస్‌మిల్లుల యజమానులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్‌మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారని, అక్రమాలకు పాల్పడుతున్న రైస్‌మిల్లుల యజమానులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. రైస్‌మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్టవేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి రైతులను తరుగు, తాలు, రవాణా పేరుతో జిల్లాలో రైస్‌మిల్లులు ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా ప్రభుత్వాన్ని కూడా మోసం చేస్తున్నాయన్నారు. ధాన్యం కాంటా వేసేటప్పుడు తరుగు తీసే పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. తరుగు రూపంలోనే రైతులకు రూ.కోట్లలో నష్టం వస్తుందని, దీనికి కారణం రైస్ మిల్లులు మాత్రమే కాదని, అధికారులు కూడా కారణం అన్నారు. జిల్లాలోని రైస్‌మిల్లులను నెలకోసారి పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయాలన్నారు. రైతులకు గన్నీ బ్యాగులను అవసరం మేరకు అందించాలని, సరిపడా లారీలను ఏర్పాటు చేసి రవాణా సమస్యలు రాకుండా చూడాలన్నారు. మొంథా తుఫాన్ వల్ల దెబ్బ తిన్న ధాన్యాన్ని నాణ్యత పేరుతో కొనుగోళ్లు ఆపద్దన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, కరుణాకర్, జిల్లా నాయకులు మద్దెల ఎల్లేష్, ఎదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమొగిలి, లక్ష్మణ్, రవి, రాజు, శ్రీనివాస్, రాజేందర్‌తో పాటు పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘జెవెల్స్ ఆఫ్ గ్లోరి వరంగల్’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎస్ రామకృష్ణారావు తదితరులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెగంటి వెంకటరమణ రచించిన జెవెల్స్ ఆఫ్ అసఫ్ జాహిస్, గ్లోరి ఆఫ్ వరంగల్, కాఫీ టేబుల్ బుక్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక కూడా పాల్గొన్నారు. వరంగల్ నగరంలోని అసఫ్‌జాహిల హయాంలో నిర్మాణమైన అద్భుత కట్టడాలు, వరంగల్ కేంద్రంగా పాలనను చేసిన సుబేదారుల వివరాలు, వారి చరిత్రతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సీఎస్ తెలిపారు. వరంగల్ ప్రధాన కేంద్రంగా నమోదైన చరిత్రలో అరుదైన విశేషాలతో ఈ గ్రంథాన్ని వెలువరించినట్లు రచయిత కన్నెగంటి వెంకటరమణ చెప్పారు.

నలుగురు దొంగల ముఠా అరెస్ట్

రూ.25వేల నగదు, ఆటో, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం


చోరీ నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడి పగలు వివిధ పనులు చేసుకుంటూ రాత్రి వేళల్లో ఆటోలో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండకు తరలించినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ చూపి ఎస్సై వివరాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన మాలోత్ శివ, భూక్య అభిరామ్, గుడిబండ్ల రాము, ఇదే జిల్లా మాలబంజర గ్రామానికి చెందిన ద్రాక్ష సుధాకర్‌లు స్నేహితులు. శివ, సుధాకర్‌లు వృత్తిరీత్యా ఆటోడ్రైవర్లు, రాము వెల్డింగ్, అభిరామ్ మెకానిక్ పనుల చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, కొద్ది నెలలుగా జల్సాలకు అలవాటుపడ్డారు. దీంతో వారికి ఆదాయం సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్నారు. పాల్వంచకు చెందిన ఓ వ్యక్తికి చెందిన ఆటోను శివ అద్దెకు తీసుకుని పగలంతా నడుపుకుంటూ రాత్రివేళల్లో నలుగురు ఆటోలో ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 28న పెద్దమ్మగడ్డలో రెండు గొర్రెలను అపహరించకుపోయి కొరివి అంగడిలో విక్రయించుకున్నారు.

మరో వారం రోజుల తరువాత అదే పెద్దమ్మగడ్డలో మరో గొర్రెను అపహరించకుపోయి నెక్కొండ అంగడిలో విక్రయించారు. నవంబర్ 10న మరోసారి పెద్దమ్మగడ్డలో రెండు గొర్రెలను అపహరించుకుపోయి కొరివి అంగడిలో విక్రయించారు. దీంతో పాటు అక్టోబర్ 23 రాత్రి నర్సంపేట పట్టణంలోని పాకాల సెంటర్‌లో 41 సెంట్రింగ్ ప్లేట్స్, బాక్స్‌ను అపహరించుకుపోయారు. వీటిని వరంగల్‌లో విక్రయించుకునేందుకు ఈ నెల 11న పాల్వంచ నుంచి నలుగురు ఆటోలో వస్తుండగా ఖానాపురం శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానస్పదంగా కనిపించడంతో వారిని ఆదుపులోకి తీసుకుని విచారించగా పెద్దమ్మగడ్డలో గొర్రెల దొంగతనం, నర్సంపేటలో సెంట్రింగ్ ప్లేట్స్, బాక్స్ దొంగతనం చేసినట్లుగా అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.25వేల నగదు, ఆటో, 4 సెల్‌ఫోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండకు తరలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ సుమన్, సీతారామరాజు, విజయ్‌కుమార్, వీరస్వామి, రమేశ్, రాజు, సంతోష్ హోం గార్డు రాంబాబు, ఎర్రయ్యను ఎస్సై అభినందించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

నలుగురిపై కేసు నమోదు

మహదేవపూర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టేందుకు యత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం శివారు గుట్టల ప్రాంతంలో కొంత మంది అనుమానితులు బుధవారం రాత్రి గుప్తనిధులకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్థుల ద్వారా సమాచారం అందడంతో అక్కడికి వెళ్లినట్లు ఎస్సై తెలిపారు. ఎల్కేశ్వరంతో పాటు సూరారం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రెండు గడ్డపారలు, ఒక గంప, తవ్వేందుకు ఉపయోగించే పరికరాలు, 10 నిమ్మకాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించిన ఏడీఆర్ఎం

కాజీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌ను బుధవారం దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ డివిజనల్ మేనేజర్(ఏడీఆర్ఎం) ఎ.సంజీవరావు సందర్శించారు. ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్‌ను అభివృద్ధి పనులను అడిగితెలుసుకున్నారు, స్నూకర్ బోర్డు, క్యారమ్ బోర్డు, లైబ్రరీలను సందర్శించారు. ఇనిస్టిట్యూట్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తానని ఏడీఆర్ఎం తెలిపారు. అంతకుముందు రైల్వేస్టేషన్, డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లను ఆయన సందర్శించారు. రైల్వే కార్మికులతో, అధికారులతో మాట్లాడి షెడ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈఎల్ఎస్‌లో మజ్దూర్ యూనియన్ బ్రాంచి సెక్రటరీ నాయిని సదానందం కార్మికులతో కలసి ఏడీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో ఖాళీలలను భర్తీ చేయాలని, ఫుట్ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని, పార్కింగ్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.


ఇనిస్టిట్యూట్‌ను పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం సంజీవరావు తదితరులు

పక్కా ప్రణాళికతో మేడారం అభివృద్ధి పనులు

(5వ పేజీ తరువాయి)


మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వ్యూ

తీసుకెళ్తున్నామని గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. కట్ ఆఫ్ తేదీ నిర్ణయించుకుని లక్ష్యసాధనలో ముందుకు వెళ్లడం సీఎం సంకల్పసిద్ధికి నిదర్శనమని కొనియాడారు. వనదేవతల దయతో గిరిజన శాఖ మంత్రిని అయ్యానన్నారు. జాతరకు ముందే పనులు పూర్తి అయ్యేలా పక్కా ప్రణాళికలతో, సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవాదాయ, ధర్మదాయ శాఖ కమినర్ హరీశ్, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కల్యాణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గోల్లపెల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, కాంట్రాక్టర్లపై మంత్రి పొంగులేటి ఫైర్

మేడారం అభివృద్ధి పనుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్నారని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు శాఖల అధికారులు, పూజారులతో హరిత హోటల్ సమావేశపు గదిలో మంత్రులు సీతక్క, సురేఖ, లక్ష్మణ్ కుమార్, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్లైడ్ షో ద్వారా మాస్టర్‌ప్లాన్ ప్రణాళికల్లో రూపొందించిన డిజైన్లను పరిశీలిస్తూ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరిగిన పనుల్లో అనుకున్న స్థాయిలో జరగలేదని పొంగులేటి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. డిసెంబరు 22 లోగా రోడ్ల విస్తరణ పనులు, డిసెంబరు 30లోగా దేవస్థానం అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అలాగే జనవరి 15 లోగా మహా జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు, వసతుల ఏర్పాట్ల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలిసింది. మేడారం ప్రధాన పరిసర ప్రాంతాల్లో 500 రకాల ఔషధ మొక్కలు నాటాలని అధికారులకు ఆదేశించారు.

మంత్రుల పర్యటన సాగిందిలా..

మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ బల రాంనాయక్ ఉదయం 11.30 గంటలకు హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన వాహనాల్లో గద్దెల ప్రాంగణానికి వెళ్లారు. వారికి ముందుగా గిరిజన పూజారులు, దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. గద్దెలకు చేరుకున్న మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న క్రమంలో కాస్త ఆలస్యంగా వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వారితో కలిసి పూజలో పాల్గొన్నారు. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను దర్శించుకున్న అనంతరం పూజారులు తల్లుల ప్రసాదాలను మంత్రులకు అందజేశారు. పట్టు వస్త్రాలను కప్పి సన్మానించారు. అనంతరం దేవస్థానంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను మంత్రులు కాలి నడకన తిరిగి పరిశీలించారు. పనుల పురోగతిపై మంత్రులకు ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్‌రావు వివరించారు. రాతికట్టడాలను నిర్మించే బేస్‌మెంట్, స్వాగత తోరణాల నిర్మాణాల పునాదులు, ప్రాకారం, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల పునఃప్రతిష్ఠించే నిర్మాణాలను పరిశీలించిన మంత్రులు అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే మేడారం వచ్చిన రాతి శిలలను పరిశీలించారు. రోడ్ల విస్తరణ పనులను పరిశీలించి డిసెంబరు 22 లోగా పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అనంతరం హరిత హోటల్‌కు చేరుకొని సమీక్షలో పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనలో అపశ్రుతి

మంత్రుల మేడారం పర్యటనలో స్వల్ప అపశ్రుతి చోటు చేసుకుంది. శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, సురేఖ, లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి పనులను పరిశీలిస్తున్న క్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ కాలు స్లిప్ అయి కిందపడిపోయారు. వెంటనే మంత్రులు సీతక్క, సురేఖ ఆమెను పైకి లేపారు. అధికారులు, పూజారులతో సమీక్ష అనంతరం మీడియా సమావేశానికి ముందు మంత్రి కొండా సురేఖను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తలపై చేయి వేసి ఆప్యాయంగా పలకరించారు. ఈ క్రమంలో ఇద్దరు నవ్వుతూ మాట్లాడుకున్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం : మంత్రి సీతక్క

మహాజాతర జనవరి 28 నుంచి 31వరకు జరగనున్న నేపథ్యంలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిశ్చయించుకున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. 90 రోజుల్లో పనులను పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే పనులకు కావాల్సిన మెటీరియల్‌ను తెప్పించుకున్నట్లు తెలిపారు. ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడడమే కాకుండా భక్తుల సౌకర్యార్థం ఈ పనులను ఒక విజన్‌తో చేపడుతున్నామని తెలిపారు.

వారి సేవలు.. ఆదర్శం

- గ్రామాభివృద్ధిలో విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ భాగస్వామ్యం
- విద్యకు ప్రాధాన్యం.. గ్రంథాలయం ఏర్పాటు

ఖానాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి, గ్రామస్థులకు ఏ సమస్య వచ్చినా మేమున్నామంటూ ముందుకు వచ్చారు విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు. ఎన్నో పనులను ఒక్కొక్కటిగా చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన యువకులు ప్రభుత్వమిచ్చే నిధుల కోసం వేచిచూడకుండా గ్రామాభివృద్ధి కోసం 2017లో 32 మందితో విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. అందులో గ్రామానికి చెందిన వివిధ యువజన సంఘాల అధ్యక్ష, కార్యదర్శితో పాటు ఇద్దరు సభ్యులను కమిటీలో భాగస్వాములను చేశారు. రాజకీయాలకతీతంగా గ్రామానికి సేవలు అందించాలని తీర్మానించారు. గ్రామాభివృద్ధిలో యువతనంతా భాగస్వాములను చేశారు.


గ్రామానికి స్వర్గ రథాన్ని అందజేస్తున్న విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ బాధ్యులు

ఒక్కో విభాగానికి ఒక్కో కమిటీని వేసుకుని గ్రామానికి అత్యవసర పనులను గుర్తించారు. శ్రమదానంతో చేసే పనులను చేపడుతూనే విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు చందాలు వేసుకుంటూ గ్రామస్థులు, అలాగే ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి నుంచి విరాళాలు సేకరించి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. విరాళాల ప్రతి పైసకు లెక్కలు చూపుతూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు

విలేజ్ డెవలప్‌మెంట్ సభ్యులు ఇప్పటివరకు గ్రామంలో రూ.30 లక్షలతో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేశారు. గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున విలేజ్ డెవలప్‌మెంట్ సభ్యులే ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. రూ.6 లక్షలతో పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపర్చారు. అలాగే స్కూల్‌కు వైఫై సౌకర్యం కల్పించారు. దీంతో పాటు గ్రామంలో రూ.5.30 లక్షలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ప్రతి ఏటా రూ.5,116 నగదు అందిస్తున్నారు. అంతక్రియల కోసం రూ.7.5 లక్షలతో స్వర్గరథాన్ని కొనుగోలు చేసి గ్రామానికి అప్పగించారు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన కందుకూరి అక్షితకు రూ.1.60 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అదేవిధంగా కరోనా సమయంలో మృతి చెందిన చిన్నపల్లి నవీన్ కూతురు పేరుమీద రూ.1.50 లక్షలు సుకన్య సమృద్ధి యోజనలో జమ చేశారు. నిరుపేదల దహన సంస్కారాలకు రూ.25 వేలు అందజేస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. లాభాపేక్ష లేకుండా గ్రామాభివృద్ధే లక్ష్యంగా సేవలు అందిస్తున్న విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ సేవలు ఆదర్శనీయం.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం..



గ్రామంలో సర్పంచ్, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులకు సహకరిస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములమవుతున్నాం. గ్రామంలో ప్రభుత్వ నిధులతో చేపట్టే పనులను నాణ్యంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామం నుంచి యువత రాబోయే రోజుల్లో అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా వారికి అవగాహన కల్పిస్తున్నాం. ధర్మరావుపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం.

చెంచాల కృష్ణ, వీడీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ధర్మరావుపేట

టీచర్లు విద్యాసామర్థ్యాలు పెంపొందించుకోవాలి

నెహ్రూసెంటర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాసామర్థ్యాలను పెంపొందించుకుని, విద్యార్థులకు బోధన చేయాలని గిరిజన సంక్షేమశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ దేశీ రాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. విద్యలో ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంచేందుకు ఏటూరు నాగారం ఐటీడీఏ పరిధిలోని జనగామ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు సంబంధించిన ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మూడు దఫాలుగా శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ కిషన్‌నాయక్, రాములు, పొడుగు నర్సయ్య, శ్రీకాంత్, పూల రాజు, చాంప్లానాయక్, ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, సురేష్, హరీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


రామన్నగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

నెల్లికుదురు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు రామన్నగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 255 కేంద్రాలను ఏర్పాటు చేసి, వసతులు కల్పించామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించి, రైతుల వివరాలు 'ఆన్‌లైన్'లో నమోదు చేయాలన్నారు. కేంద్రాలలో గన్ని సంచులు, తార్పాలిన్లు, మ్యాచర్ మిషన్లు, ప్యాడీక్లీనర్స్, వేయింగ్‌మిషన్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు సహకరించాలన్నారు. ధాన్యం రవాణా విషయంలో వాహనాలను నిత్యం సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. హమాలీలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ, సహకార, గిరిజన కార్పొరేషన్, డీఆర్‌డీఏ, ఐకేపీ, పౌరసరఫరా, తహసీల్దార్‌లు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ జిల్లా లక్ష్యాన్ని విజయవంతంగా నిర్వహించి, కొనుగోళ్ల పూర్తి చేయాలన్నారు. పత్తి, సోయా పంటల కొనుగోళ్ల విషయంలో క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. అనంతరం కస్తూర్బా బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. స్టోర్‌గది, టాయిలెట్స్, డైనింగ్ హాల్, కిచెన్‌షెడ్, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు హెల్త్‌ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్‌పై అవగాహన కల్పించాలని, నూతన విద్యావిధానం, డిజిటల్ తరగతులు, విద్యార్థులకు అవసరమైన విద్యాబోధన, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చందన రేష్ పాల్గొన్నారు.

16న పంచారామాలకు టూర్ ప్యాకేజీ బస్సు

- మానుకోట డీఎం కల్యాణి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మానుకోట ఆర్టీసీ డిపో నుంచి ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీలో భాగంగా ఈ నెల 16న రాత్రి 11 గంటలకు పంచారామాలకు 40 సీట్ల డీలక్స్ బస్సు బయలు దేరుతుందని మేనేజర్ కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట (పంచారామాలు)లను సందర్శించి తిరిగి అక్కడి నుంచి ఈనెల 18న మానుకోటకు బస్సు చేరుకుంటుందని చెప్పారు. పెద్దలకు టిక్కెట్ ధర రూ.1700, పిల్లలకు రూ.900 నిర్ణయించడం జరిగిందని, బుకింగ్ కోసం ఎంఆర్ రెడ్డి సెల్ : 73962 10102, ఎమ్డీ నబీ సెల్ : 99482 14022లకు ఫోన్‌పే చేసి సీటు రిజర్వు చేసుకోవాలని సూచించారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంచారామాల పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏడీఏ


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు (ఏడీఏ) అజ్మీరా శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్కులు, పీవోఎస్ మిషన్లు, గోదాంల్లో నిల్వలను పరిశీలించారు. ప్రతీరోజు ఎరువుల క్రయవిక్రయాలపై రికార్డుల్లో నమోదు చేయాలని ఆయన సూచించారు. మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న ఉన్నారు.

సీసీఐ కొనుగోళ్లలో నిబంధనలను ఎత్తివేయాలి

- రైతు సంఘం జిల్లా నాయకులు

కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలోని పత్తి కొనుగోళ్లలో రైతులకు అడ్డుగా ఉన్న నిబంధనలను ఎత్తివేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మార్తినేని పాపారావు డిమాండ్ చేశారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి, మొక్కజొన్న, ధాన్యం రైతులతో వారు మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీఐ కొనుగోళ్లలో కపాస్ యాప్‌లో ఎకరాకు ఏడు క్వింటాళ్ల నిబంధన తొలగించి 12 క్వింటాళ్లకు పెంచాలని కోరారు. పంటలను నమోదు చేయకపోవడం వల్ల చాలా మంది రైతులకు స్లాట్ బుక్ కావడంలేదని తెలిపారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనైనా పత్తి విక్రయించుకునే అవకాశం కల్పించాలని కోరారు. వారి వెంట సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నీరుటి జలేందర్, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, ఇస్లావత్ పతాని, జల్లె జయరాజ్, సోమారపు ఎల్లయ్య, చాగంటి కిషన్, బానోత్ రాంకోటి పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకులపై కేసు

- 1.750 కేజీల ఎండు గంజాయి, 4 సెల్ ఫోన్లు సీజ్ ● మానుకోట సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్‌క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని, ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్రంలోని పత్తిపాక కాలనీలో ఓ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేయడంతో ఖమ్మం పట్టణానికి చెందిన మండల సంతోష్‌కుమార్, మానుకోట పట్టణంలోని కంకరబోడుకు చెందిన షేక్‌షకీల్, గూడూరు మండలంలోని కొల్లాపూర్ గండితండాకు చెందిన గుగులోతు అనిల్, మార్కేండేయ టెంపుల్ కాలనీకి చెందిన సాయి గణేష్ ముఠాగా ఏర్పడి, స్థానిక యువకులకు ఎండు గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎస్సై అశోక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఎస్సైని చూసి పారిపోతుండడంతో అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 1.750 కేజీల ఎండు గంజాయి లభించిందని, దాని మార్కెట్ విలువ సుమారు రూ.85 వేలు ఉంటుందన్నారు. పట్టుకున్న గంజాయిని స్వాధీనం చేసుకొని, 4 సెల్ ఫోన్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


లాడ్జీలో రికార్డులను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

లాడ్జీల్లో తనిఖీలు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు లాడ్జీలపై పట్టణ పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సీఐ మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో లాడ్జీలకు ఆశ్రమం కోసం వచ్చే బాధితుల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

నెహ్రూసెంటర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ బోర్డు హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం.. డీఎంఎస్టీ, డీఈసీజీ పారా మెడికల్ కోర్సులకు అడ్మిషన్లు పొందడానికి దరఖాస్తుల స్వీకరణ గడువును పొడగించినట్లు మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈనెల 27వ తేదీలోగా తమ పత్రాలను సాయంత్రం 5 గంటల్లోగా అందచేయాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు కావాల్సిన సర్టిఫికెట్స్, ఒరిజినల్ సెట్, జిరాక్స్ కాపీలను, రెండు పాస్‌ఫోటోలను జత చేయాలన్నారు. అప్లికేషన్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన, సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించని పక్షంలో దరఖాస్తును తిరస్కరించబడునని చెప్పారు.

రెడ్యాలలో మూడోరోజూ బ్రహ్మోత్సవాలు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రెడ్యాల గ్రామంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో దేవస్థాన నిర్మాణ ధర్మకర్తలు, గ్రామమాజీ సర్పంచ్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి-బిందురెడ్డి దంపతులు, ఎన్ఆర్ఐ వెన్నం విజయ్‌కాంత్‌రెడ్డి- శిల్పారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరుగుతున్న పంచమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు మూడోరోజుకు చేరుకున్నాయి. బుధవారం ఉదయం 9 గంటలకు యాగశాలలో నిత్యారాధనం, మూలమంత్ర పారాయణం, ఉదయం 10 గంటల నుంచి సుదర్శనయాగం, మంగళశాసనం, సాయంత్రం 6 గంటల నుంచి యాగశాలలో నిత్యారాధనం, మూలమంత్రహవాన పారాయణం నిర్వహించారు. భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నర్సింగం శ్రీనివాస్, సత్తిరెడ్డి, సోమయ్య, రమేష్, వెంకటయ్య, సురేందర్, వెంకన్న, దేవిరెడ్డి, హైమా, విజయ, రేణుక, సరిత పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ పోస్టర్ ఆవిష్కరణ

కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నల్గొండలో ఈనెల 15న నిర్వహించే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) కేసముద్రం సబ్ డివిజన్ కార్యదర్శి కన్మంతరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. కేసముద్రంలో బుధవారం ఆ కౌన్సిల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌కె మౌలానా, ఇమామ్, హుస్సేన్ పాల్గొన్నారు.

సమాచారాన్ని చేరవేయడంలో పీఆర్వోల పాత్ర కీలకం : డీజీపీ


డీజీపీ నుంచి ట్రైనింగ్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఎస్పీ పీఆర్వో కుషాల్‌కుమార్

మహబూబాబాద్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖ ప్రతి ఛాయలను ప్రపంచానికి చేరవేయడంలో పీఆర్వోల పాత్ర కీలకమైనదని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన పీఆర్వోల శిక్షణ ముగింపు కార్యక్రమానికి బుధవారం ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రజలతో పోలీసులు కలిపే వంతెనలుగా పీఆర్వోలు వ్యవహరించి, ప్రతీ సంఘటనలో పోలీస్‌శాఖ నియమావళిని సమాజానికి చేరవేయడంతో కీలక భూమికగా ఉండాలన్నారు. సమాచారాన్ని బాహ్య ప్రపంచానికి చేరవేయడంతో పోలీస్‌శాఖ ప్రతిష్ట పెరుగుతుందన్నారు. అనంతరం పీఆర్వోలందరికి ధ్రువపత్రాలను అందజేశారు.

కళాశాలకు నూతన భవనం నిర్మించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బాషిపాక పవన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్ చొరవచూపి కళాశాలకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో తాజ్, నవీన్, లక్ష్మణ్, జశ్వంత్, వరుణ్, సన్నీ పాల్గొన్నారు.

దీక్షను విజయవంతం చేయాలి

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గూడూరు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గురువారం నిర్వహించే ధర్మ పోరాట దీక్షను విజయవంతం చేయాలని మండల బీసీ జేఏసీ చైర్మన్ చీర బిక్షపతి, కన్వీనర్ కట్ల విష్ణు, రాష్ట్ర బీసీ సంఘం నాయకులు పెద్దకాసు కుమారస్వామిలు పిలుపునిచ్చారు. గూడూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గూడూరు అంబేద్కర్ సెంటర్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మపోరాట దీక్షకు బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. నాయకులు ముక్తవరం సత్యనారాయణ, యాకాంబ్రం, నూకల ఉపేందర్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీశైలం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం కోరారు. మహబూబాబాద్‌లోని గిరిజన ఆశ్రమ బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలు, ముత్యాలమ్మగూడెం, పాతరెడ్యాల ఆశ్రమ పాఠశాలలను బుధవారం సందర్శించి సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీశైలం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పండిట్‌లు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు గత సంవత్సరం సమ్మె చేసిన నేపథ్యంలో మినిమం టైంస్కేల్ వర్తింప చేయడం, రెగ్యులరైజేషన్, 1వ తేదీనే వేతనాలు చెల్లించడం మొదలగు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 24నే జిల్లా కేంద్రాల్లోని ఐటీడీఏ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బిక్షపతి, రామలింగారెడ్డి, పూల్‌రాజ్, శ్రీనివాస్, శ్రీను, హరీష్, రమేష్ పాల్గొన్నారు.

ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో ఫిమేల్ లిటరసీ (ఎల్‌ఎఫ్‌ఎల్) ప్రధానోపాధ్యాయుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని గాదెరుక్మారెడ్డి హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా కల్లెం వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తేజావత్ బాలాజీ, ఆర్థిక కార్యదర్శిగా తాటికాయల సురేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కాపరబోయిన శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా ప్రమీల, మహిళా ఉపాధ్యక్షులుగా అనిత, గోదుమ, రాష్ట్ర కౌన్సిలర్లుగా గుగులోతు హల్యానాయక్, మంగునాయక్, రాంజీనాయక్, పులిపాటి తిరుమలేష్, అనుమాండ్ల సత్యనారాయణరెడ్డిలను ఎన్నుకున్నారు.

'కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలి'


సీఐ చంద్రమౌళికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

డోర్నకల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలో కుంటలను కబ్జా చేసిన వారిని గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు లకన్‌వ్యాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డోర్నకల్ సీఐ చంద్రమౌళికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లకన్‌వ్యాస్ మాట్లాడుతూ నైజాం ప్రభుత్వ హయంలో నిర్మించిన కుంటలను, చెరువులను కొందరు తమ పేరుపై ఇటీవల పట్టాలు చేయించుకుని.. కుంటలను స్వాధీనం చేసుకున్నారని, వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుని తిరిగి కుంటలను, చెరువులను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్, నగేష్, నరేష్, దేవాసింగ్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో యజ్ఞమహోత్సవం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో యజ్ఞ మహోత్సవంలో భాగంగా బుధవారం గోపూజ నిర్వహించారు. స్థానిక ఆలయంలో అర్చకులు తాటిపాముల శివకృష్ణచార్యుల శిష్యబృందం వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి మహాయజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ట్రస్టు చైర్మన్ పమ్మి సనాతనాచారి, విజయలక్ష్మీ, వాసుదేవాచారి, ప్రియాంక, అశోకాచారి, స్వాతి, శ్రీధరాచారి, నాగరాణి, రాములు, రితిక, నిక్షిత, విశ్వనాథం, భాగ్యలక్ష్మీ, సతీష్, నిర్మల, గీతాదేవి పూజలో పాల్గొన్నారు. అనంతరం ట్రస్టు చైర్మన్ సనాతనాచారి మాట్లాడుతూ... ఈ నెల 15న యజ్ఞ మహోత్సవంలో భాగంగా అన్నదాన కార్యక్రమానికి వెంకట జ్యోతి, స్వరూప్‌రేఖ, కార్తీక్, స్రవంతి, సతీష్, సమ్మి సనాతనాచారి, అనురాధ, పమ్మి నాగబ్రహ్మాచారి, సెల్వాది రాజ, కొండవర్తి సతీష్, విజయగిరి, రాజమౌళి, అశోకచారి, ఒబిలిశెట్టి రామకృష్ణ సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇంటిబిల్లు ఇవ్వడంలేదని..

- జీపీ కార్యాలయంలో వంటావార్పు ● మానుకోట మండలం అయోధ్యలో ఘటన


అయోధ్యలో బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మించిన ఇంటి వద్ద సుశీల

మహబూబాబాద్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు బర్ల సుశీల తన గృహానికి బిల్లు ఇవ్వడం లేదని బుధవారం ఆరోపిస్తూ.. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వంటావార్పు నిర్వహించి, నిరసన తెలిపారు. బాధితురాలు సుశీల, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. అయోధ్యకు 22 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. జూన్ 1న లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం సుశీల బేస్‌మెంట్ లెవల్ వరకు ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. మొదటి విడత రూ.లక్ష బిల్లు చెల్లించకపోవడంతో పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినప్పటికి ఫలితం లేకపోవడంతో బుధవారం సుశీల సోదరుడు వెంకన్న కుటుంబసభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వంటావార్పు చేపట్టి, నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా గ్రామస్థులు నిలిచారు. మాజీ ఎంపీటీసీ కొత్త సారయ్య మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఫోన్‌చేసి ఈ విషయాన్ని వివరించారు. ఇందిరమ్మ లబ్ధిదారు సుశీలకు బిల్లు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆమె ఆందోళనను విరమించారు.

బీసీల్లో ముదిరాజ్‌ల వాటా కేటాయించాలి

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దుర్గేష్

కేసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ముదిరాజ్‌లకు జనాభాకు తగ్గట్లుగా వాటాను కేటాయించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం ఆ మహాసభ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన ఫోన్లో మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని, ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెల 21న సంఘం 11వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామగ్రామాన జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చీఫ్ ప్రమోటర్ కొత్త రమేష్, జిల్లా కార్యదర్శులు పిట్టల ధనుంజయ్, సూరయ్య, గుండా వెంకన్న ఉన్నారు.

జిల్లాకు 12 మంది సూపరింటెండెంట్‌ల కేటాయింపు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ అసిస్టెంట్లుగా పని చేసున్న వారికి సూపరింటెండెంట్లుగా పదోన్నతులు కల్పించి.. జిల్లాకు కేటాయించిన 12 మంది ఉద్యోగులకు బుధవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ నియాక ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ మండల ప్రజా పరిషత్ సూపరింటెండెంట్‌గా డి.వీరభద్రరావు, జిల్లా ప్రజా పరిషత్‌కు నాగ మల్లేశ్వర్‌రావు, కురవికి పృథ్వీరాజ్, గూడూరుకు సీహెచ్. శ్రీనివాస్, కేసముద్రంకు ఎం. కృష్ణ, గంగారానికి సిద్ది శ్రీనివాస్, దంతాలపల్లికి కె.జయ, కొత్తగూడకు ఎస్. మహేందర్‌రెడ్డి, పెద్దవంగరకు డి. శైలజాకుమారి, చిన్నగూడూరుకు రేణుకాదేవి, నర్సింహులపేట మండల ప్రజా పరిషత్ సూపరింటెండెంట్‌గా డి.రాజేశ్వరికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆయా పోస్టులో బాధ్యతలను స్వీకరించనున్నారు.

వ్యక్తిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్

కొత్తగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన వ్యక్తిపై వరంగల్ జిల్లాలోని ఓపోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు నమోదు అయింది. కాగా, బుధవారం మండలంలోని గోపాలపురం కేసు నమోదు అయిన వ్యక్తిని వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని వెళ్లారు.

'నాన్నగారి ఆశయ సాధనకు కృషి చేస్తా'

డోర్నకల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ నియోజకవర్గంలో 45 ఏళ్ల పాటు ప్రజలందరి మన్నన్నలు పొంది.. వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న తన తండ్రి నూకల నరేష్‌రెడ్డి ఆశయ సాధన కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకులు, పురుషోత్తమయగూడెం మాజీ సర్పంచ్ నూకల అభినవ్‌రెడ్డి అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో బుధవారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల మధ్య అభినవ్‌రెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. వారికి నోట్‌పుస్తకాలను అందచేశారు. కాంగ్రెస్ నాయకులు కాల సుమీర్ చంద్‌జైన్, మహేందర్‌జైన్, మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, గండి రాంమోహన్, శీలం శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, ప్రవీణ్‌బాబు పాల్గొన్నారు.

మహాసభలను సక్సెస్ చేయాలి

గార్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి : సంగారెడ్డి పట్టణంలో 18న జరిగే తెలంగాణ మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలను ఉద్యోగులు విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకుడు బైరపాక శ్రీనివాస్ రావు కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మహాసభ గోడ ప్రతులను స్థానిక డాక్టర్లతో కలిసి, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ శ్రద్ధ చూపాలన్నారు. మహబూబాబద్ జిల్లా పరిషత్ ఆసుపత్రి కోఆర్డినేటర్ డాక్టర్ చింత రమేష్, డాక్టర్ శ్రీధర్‌గౌడ్, సీఐటీయూ జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, , సిబ్బంది దేవరాజ్, మల్సూర్, అశోక్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

డోర్నకల్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు డోర్నకల్ జడ్పీహైస్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం బండి నర్సింహారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న జనగామలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల్లో ఫుట్‌బాల్ విభాగంలో తొనగర్ తులసి, రెడ్డబోయిన కార్తీక, కట్రోజు వైష్ణవి, తర్రి గౌతమి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 14న నల్గొండ జిల్లాలో జరిగే పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు నుంచి వీరు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, కొండ్ర రవికుమార్, సాహెబ్‌అలీ, విద్యాసాగర్, శంకర్, మంజులత అభినందించారు.

నిరుపేదకు సెలూన్ సామగ్రి అందచేత

కురవి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కురవికి చెందిన ఇన్‌స్టాగ్రామ్ రఘు తన మానవత్వాన్ని చాటుకున్నాడు. కురవిలో అనాథగా జీవిస్తున్న నాయీబ్రహ్మణుడు ముత్తయ్యకు సెలూన్‌షాప్ సామగ్రిని బుధవారం అందించాడు. ముత్తయ్య దీనగాథను రఘు ఇన్‌స్టాలో పోస్ట్ చేయగా ,శివ అనే దాత ముత్తయ్యకు సెలూన్‌షాపులో ఉపయోగించే అద్దం, కత్తెరలు, ఇతర సామగ్రిని పంపించగా, రఘు ముత్తయ్యకు అందించాడు. మల్సూర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కురవి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గందసిరి జ్యోతిబసు, పట్ల మధు డిమాండ్ చేశారు. కురవిలో ఎస్ఎఫ్ఐ 5వ మండల మహాసభలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో దేశవ్యాప్తంగా శాస్త్రీయమైన విద్యావిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రధాని మోదీ విద్యా వ్యతిరేక విధానాలు తీసుకువస్తూ పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నారని విమర్శించారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వీరేందర్, ఉపాధ్యక్షులు జక్కుల గణేష్, మైత్రి, ప్రజ్ఞా, కల్యాణి, ఉజ్వల్, ప్రసాద్, తరుణ్, అఖిల్, చందు పాల్గొన్నారు.


ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జ్యోతిబసు